19)పాడి

ప॥ తెలిసితే మోక్షము తెలియకున్న బంధము। కలవంటిది బదుకు ఘనునికిని॥

చ॥ అనయము సుఖమేడ దవల దుఃఖమేడది। తనువుపై నాసలేని తత్త్వమతికి।
పొనిగితే బాపమేది పుణ్యమేది కర్మమందు। వొనర ఫలమొల్లని యోగికిని॥

చ॥ తగినయమృతమేది తలపగ విషమేది। తెగి నిరాహారియైనధీరునికిని।
పగవారనగ వేరి బంధులనగ వేరీ। వెగటుప్రపంచమెల్ల విడిచేవివేకికి॥

చ॥ వేవేలువిధులందు వెఱపేది మఱపేది। దైవమునమ్మినయట్టిధన్యునికిని।
శ్రీవేంకటేశ్వరుడు చిత్తములో నున్నవాడు। యీవలేది యావలేది యీతనిదాసునికి॥